# ★ సౌందర్యోపాసన....

జి. జోగారావు

[ఒక చిత్రమైన కథ]



●

ప్యాసింజరు ట్రయిను స్టేషను ప్లాటుఫారమ్మను సమీపిస్తూంది.

ఆ బండిలోనే ప్రయాణం సాగిస్తూన్న నారాయణరావు అతని మిత్రులను హెచ్చరించాడు. 'రాజా' ఆ మూలకేసి కిటికీ నీవు చూచుకో... కృష్ణా! మధ్య కిటికీ నీదిసుమా, తెరవనీకోకు... ఈ ద్వారముదగ్గర నేను నిలబడతాను. ఇది జంక్షను స్టేషను. జనము సమర్దముగానే వుండవచ్చు. కాని విశ్వం నాదగ్గర అండగావుండగా యీ బండిలో యెవడు కాలుపెట్టగలడో చూస్తాను.

అనే నారాయణరావు మాటలు గాలిహోరులో మ్రోగుతున్నాయి.

'ఓ. కే.' అన్నాడు విశ్వం మిగతా మిత్రులు అతన్ని అనుసరించారు.

నారాయణరావు బి.యే. జూనియరు క్లాసులో చదువుతున్నాడు. మిగతా వారంతా అతనికి కాలేజీమేట్సు, హాస్టలుమేట్సు. శెలవులకు స్వగ్రామము ప్రయాణమవుతూ మిత్రులందరూ పట్నమునుంచీ వొకపెట్టెను ఆక్రమించుకొని పదిమంది యెక్కే ఆ బండిలో ఆ నలుగురే ప్రయాణంచేస్తున్నారు మరెవరినీ రానీకుండా. కిటికీ తలుపులు బంధించి వొకవైపు ద్వారము తాళమువేసి పెట్టి అంతా జనసంకీర్ణముగా వున్నట్లు ప్లాటుఫారమ్మీదవారికి తోపించేలా నటించుకుంటూ యింతవరకు అందులో యెవరినీ యెక్కనీలేదు. ఈ స్టేషనులోకూడ యెవరినీ రానీకూడదనే యిపుడు వారు హెచ్చరించుకున్నది.

రైలు ప్లాటుఫారమ్మీదకు వచ్చి ఆగింది. ఈ కొసనుంచి ఆ కొసవరకు జనము రైలుపెట్టెలో యెక్కడానికి ప్రయత్నముచేస్తూ త్రొక్కిసలాడిపోతూన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రయాణీకులు యీ పెట్టెదగ్గరకు వచ్చినా ద్వారముదగ్గర వొకరిమీద వొకరు పడుతూ నించున్న నారాయణరావును విశ్వాన్ని చూచి అందులో యెక్కే ప్రయత్నం మానుకున్నారు. ఒక పల్లెటూరు రైతు చేత్తో చిన్నపెట్టి, తలమీద గోనెసంచీతో తయారయితే విశ్వం 'నిండా జనం వున్నారు. ఖాళీ లేదు' అని కసరివేశాడు.

ప్లాటుఫారమ్మీద జనము హడావుడిగా యిటు అటు పరుగిడి పెట్టెల్లో యెలాగో సర్దుకున్నారు. ఇపుడు జనసమర్దము చాల తగ్గిపోయింది. కిటికీ దగ్గర వున్న రాజారావు 'బలే! జయించాముర్రా' అని విజయసూచకంగా పలికేడు. ఈ సమయంలోనే స్టేషనులోనుంచీ పదహారుయేళ్ళ పడుచుపిల్ల చంకలో మూట చేత్తో కూజబుట్ట పట్టుకొని- అరవైయేళ్ళ ముసలి అలసటతో వో సూటుకేసు మోసుకువస్తూ ప్లాటుఫారమ్మీదకువచ్చారు. జాగా దొరకదేమో అను ఆతృత వారి ముఖములమీద ద్యోతకమవుతూంది.

నారాయణరావు చూపులు వారిమీద పడినాయి. అందమైన యే వస్తువైనా ఆనందదాయకమయినదనే కీట్సు సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మేడు నారాయణరావు. ఆ పిల్ల సౌందర్యము అతన్ని బాగా ఆకర్షించింది. అతనిలోని సౌందర్యపిపాస తలచూపింది. స్త్రీలోని సౌందర్యాన్ని వుపాసించే స్వభావం అతనికి చిన్నతనమునుంచీ వుంది. అప్పటి అతని కర్కశభావము కరగి వూరుకుంది. 'వోరేయి...ఆమెను యిందులోనికి...' అంటూ నారాయణరావు అతనికి తెలీకుండానే పెట్టె దిగిపోయి ముసలమ్మను చేరాడు. విశ్వము కూడ దారితీయగానే మిగతా యిద్దరూ అతన్ని అనుసరించారు.

'ఏమండీ' అవ్వగారూ! (ఆ పిల్ల ఆమెకు మనుమరాలై వుంటుందని నారాయణరావు వూహించాడు) చాల శ్రమతో పెట్టె మోసుకువస్తు

న్నారే...ఇలా యివ్వండి. మా పెట్టెలో జాగా వుంది రండి' అని అవ్వగారి చేతిలోని నూటుకేసు అందుకున్నాడు.

ఆ పిల్ల యెంత సౌందర్యవతో అవ్వ అంత అనాకారి. కాని ఆ పిల్ల సాన్నిధ్యాన్ని అభిలషిస్తే అంతకన్న వేరే మార్గములేదు. అవ్వను పొగడాలిసిందే. నారాయణరావు యిది గ్రహించే అవ్వగారిని మనసులో అసహ్యించుకున్నా పైకి ప్రియవచనాలతో ఆహ్వానించాడు. మిత్రునిలాగా అనాచిత పరోపకారబుద్ధి మిగతా వారికి కూడా అంటువ్యాధిలా వ్యాపించింది.

'ఆ సజ్జబుట్ట యిలా యియ్యి అమ్మాయి. రెండూ యెలా పట్టుకుంటావు' అని విశ్వం వినయంగానే ఆ పిల్లదగ్గరనుంచి పుచ్చుకున్నాడు.

'ఈ జనసమ్మర్దాన్ని చూచి మీరు గాబరా అవవద్దు. మా పెట్టెలో చాలా జాగా వుంది' అని వారిని స్వస్థతపరిచి దారితీసాడు కృష్ణరావు.

'చాల దూరమునుంచి తెస్తున్నావల్లే వుంది. పాపం! ఆ మూట యిలా యియ్యి చెల్లాయీ' అని రాజారావు ఆ పిల్ల మోస్తూన్న బరువును తను మోయసాగాడు.

అయిదు నిముషాల్లో ఆ ముదుసలి స్త్రీ, ఆమె మనుమరాలు పెట్టెలో సదుపాయంగా ఆసీనులయారు. 'మామ్మగారూ యేమమ్మా చెల్లాయీ మీకు యిబ్బందిలేకుండా వుందికదా' అని మిత్రులు నలుగురూ పరామర్శించారు. అయితే నలుగురి హృదయాల్లోను కూడ ఆ సౌందర్యరాశి తమకు అంత సామీప్యములో వుందికదా అనే సంతుష్టి నిండివుంది. వారు పడిన శ్రమకు కనబరచిన త్యాగానికి అదే మూల్యమని వారి అభిప్రాయము. అట్టి వుద్దేశముతోనే కురూపి అయిన ఆ ముదుసలి స్త్రీని కూడ వారు ఆదరించ సిద్ధపడినారు. ఆ సౌందర్యవతి లేకపోతే అవ్వగారిమీద కోసి ఆమెను త్రోసివేయక పోయేవారా?

నారాయణరావు మాత్రము నిలుకడలేని అతని చూపులను నిరాఘాటంగా ఆ పిల్ల ముఖంమీదకు పోనిస్తూన్నాడు. అతడు కల్పిత భావనాలోకంలో చరిస్తున్నాడు.

'ఐసుక్రీము...సోడా' అని ప్లాటుఫారమ్మీద కేక విని విశ్వం విజయోన్మాదముతో 'అరు ఐసుక్రీములు యివ్వు' అని వెండరుకు ఆర్డరు చేసాడు.

విశ్వం యిస్తూన్న ఐసుక్రీము అందుకుంటూ 'ఎందుకండీ యివన్నీ...జాగాయిచ్చిందే చాలన్నా' అని ఆ అమ్మాయి మధురస్వరంతో పలికింది. 'ఎంత తియ్యగా వుందండీ యిది' అంది మళ్లీ వేలితో నోటపెడుతూ. 'మీ ఆదరణకు మా అమ్మమ్మ నేను కూడ...'

ఆమె మాటను జారనీకుండా మధ్యలోనే 'ఎంతమాటండీ...పరులకు ఆమాత్రం సాయపడకపోతే మానవ జీవితముయొక్క సాఫల్యత యేముంది' అని రాజారావు మాటలు జారవిడిచాడు.

'చాల దూర ప్రయాణమండీ...అదృష్టవశాత్తు మంచి సాయమే దొరికింది' అని ఆ అమ్మాయి మందహాసము చేసింది.

'ప్రతివాడూ స్వార్థపరుడే అయితే ప్రపంచము నడుస్తుందండీ' అని విశ్వం విశ్వకల్యాణానికి గాను వుద్ఘాటించాడు.

'అవ్వగారూ! సోడా త్రాగుతారా! మంచి నీరు తేనా పైపుదగ్గర' అని అమ్మాయికేసిచూస్తూ అవ్వగార్ని అడిగాడు కృష్ణరావు.

'నాయనా! నాకేమి యిపుడు...' అంటూండగానే గార్డు విజిలువేసాడు.

ముదుసలి స్త్రీ ఆందోళనగా 'ఏమేవ్! కమలా! నన్ను దిగపెట్టడానికి వచ్చావన్న సంగతి మరిచిపోయావా యేమిటి. బండి కదులుతుంది త్వరగాను. ఇక దిగు' అంది.

నీళ్లు తేవడానికి సిద్ధమయిన కృష్ణ యేదో అనబోయి నీళ్లు నములుతూ నిలుచుండిపోయాడు.

ఇంజను కూత కూసింది.

ఒక చూపులోనే నలుగురి ముఖాలు పరికించి కమల పెట్టె దిగిపోయింది. బండి ముందుకు కదిలింది. కమల ఆకారము వెనుకబడుతూండటంలో విశ్వానికి యీ విశ్వమే శూన్యంలా కనబడింది. రైలుబండి నడుస్తూన్నా రాజారావు కృష్ణ అచేతనుల్లా నిలబడ్డారు.

కమల ముఖం మాయమయిపోయినాక ఆ ముదుసలి స్త్రీ వికృతస్వరూపాన్ని వొక క్షణకాలము చూచి కళ్లు మూసుకొని రైలుపెట్టె కిటికీ తలుపుకి జారబడిపోయాడు సౌందర్యోపాసకుడు నారాయణరావు.